క్లుప్తంగా

రేపు నీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని సర్కిల్-1 ప్రాంతంలో ఉన్న గాంధీబావి బూస్టర్‌లో పాడైన గేట్‌వాల్స్ స్థానంలో నూతన వాల్స్ ఏర్పాటు చేస్తున్నందున ఈ నెల 8వ తేదీన సాయంత్రం నుంచి 9వ తేదీ ఉదయం వరకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని శ్రీనివాస మహల్, గాంధీబావి, ఫిష్‌మార్కెట్ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా జరిగే ప్రాంతాలైన బ్రాహ్మణవీధి, ఫిష్‌మార్కెట్, మహంతిపురం, సుబ్బరామయ్య రోడ్డు, కొత్తపేట కొండప్రాంతం, సుబ్రమణ్యస్వామి గుడి తదితర ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

దుర్గగుడి ప్రాంగణంలో పాము కలకలం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ప్రాంగణంలోని క్యూలైన్‌లో బుధవారం ఉదయం పాము కలకలం సృష్టించింది. బుధవారం ఉదయం 8.30 గంటల సమయంలో అమ్మవారికి బాలభోగం సమర్పించే నిమిత్తం అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో అన్ని క్యూలైన్లు ఖాళీగా ఉన్న సమయంలో ఆలయ ప్రాంగణంలోని హుండీల వద్ద సుమారు 6 అడుగుల ఉన్న పాము కనిపించింది. అయితే ఆలయం వెలుపల ఉన్న దేవస్థాన సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది పామును చూసి ఒక్కసారిగా షాక్‌కు గురై వెంటనే అర్చకులను అప్రమత్తం చేశారు. క్యూలైన్ బయట ఉన్న సమయంలో పాము నోట ఒక పెద్ద కప్ప ఉండటాన్ని సిబ్బంది గమనించారు. వెంటనే పాములు పట్టే యువకుడిని పిలిచేలోగా అక్కడే మెట్ల పక్కన ఉన్న నీళ్ల పోయే కలుగులోకి దూరింది. దీంతో వెంటనే సెక్యూరిటీ సిబ్బంది పాము తిరిగి బయటకు రాకుండా కలుగులో గోనే పట్టా, క్లాత్ ముక్కలను పెట్టి మూసేశారు. పాము బయటకు వచ్చినా ఎవరికి ఇబ్బంది కలగకుండా అందరినీ అప్రమత్తం చేసేందుకు మధ్యాహ్నం వరకు ఓ సెక్యూరిటీని అక్కడ ఉంచారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి



ధ్యానచంద్ర
వీఎంసీ కమిషనర్

పటమట(విజయవాడ తూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అనధికారిక లేఅవుట్లను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ మేరకు దరఖాస్తు చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీవో నంబర్ 134 మేరకు అనధికార లే-అవుట్లు ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం-2020ని పొడిగించి సవరణ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలో ఈ ఏడాది జూన్ 30లోపు వేసిన అనధికారిక లే అవుట్లు, ప్లాట్లు నిర్ణీత జరిమానాతో, 14 శాతం ఓపెన్‌స్పేస్ చార్జెస్ చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీ://ఎల్‌ఆర్‌ఎస్‌టీడీసీపీడాట్‌ఏపీడాట్‌జీవోవీడాట్ఇన్/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను వీఎంసీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసిన తర్వాత మిగిలిన 14 శాతం ఓపెన్ స్పేస్ చెల్లించి క్రమబద్ధీకరించవచ్చన్నారు. 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జిలలో 50 శాతం రాయితీ సెప్టెంబర్ 10లోపు చేసుకుంటే వారికి పీనలైజేషన్ చార్జీలలో 10 శాతం వస్తుందన్నారు. అక్టోబర్ 24వ తేదీలోపు చెల్లించిన వారికి పీనలైజేషన్‌లో 5 శాతం మాత్రమే రాయితీ వస్తుందని వారికి రైల్వే/రక్షణ శాఖల మార్గదర్శకాలలో పేర్కొన్న షరతులకు లోబడి ఉన్నవారికి అబ్జెక్షన్ సర్టిఫికేట్ అవసరం లేదని కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఇతర వివరాలకు వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

కృష్ణాష్టమి వేడుకల ఆహ్వాన పత్రిక అందజేత



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక కరకట్ట సౌత్ రోడ్‌లో పున్నమిఘాట్ వద్ద గల శ్రీకృష్ణ దేవస్థానం తృతీయ వార్షికోత్సవంతో పాటు శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలకు హాజరు కావాలని ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీకి నిర్వాహకులు ఆహ్వాన పత్రికను అందజేశారు. భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లో ఆయనను బుధవారం కలిసి ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న వేడుకలకు సంబంధించి ఆహ్వాన పత్రికను అందించారు. వేడుకలకు తప్పకుండా వస్తానని ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ చెప్పారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ దేవస్థానం కమిటీ అధ్యక్షుడు మాదాల చెన్నయ్య, ఉపాధ్యక్షుడు కొవ్వూరు భాస్కర రావు, కార్యదర్శి ఎలికా వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ కాకు నారాయణ, దాసరి రవి, గుమ్మడి రాజు, పి.రాఘవయ్య పాల్గొన్నారు.

నత్తనడకన డ్రెయినేజీ పనులు

- మూడు నెలలవుతున్నా కొలిక్కిరాని పనులు
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అడ్డొస్తుందని పనులు నిలిపివేత
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు



డ్రెయిన్ నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతం



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అడ్డొచ్చిందని పనులు నిలిపేసిన వైనం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం అంబేడ్కర్ రోడ్‌లో డ్రెయినేజీ పనులు ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా పూర్తి కాకపోవడంపై అటు నివాసితులు ఇటు రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు అర కిలోమీటర్ దూరం డ్రెయినేజీ నిర్మాణాన్ని నెలల తరబడి చేయటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్‌కు తమ కష్టాలు పట్టవా అని ప్రశ్నిస్తున్నారు. వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో తవ్విన మట్టి, వ్యర్థాలను పడేసి రోజుల తరబడి ఉంచేస్తే ట్రాఫిక్ సమస్యలు ఎదురవ్వవా అని మండిపడుతున్నారు. అభివృద్ధి పనులు జరిగేటప్పుడు కొంత అసౌకర్యం కలగటం సహజమని, అలాగని నెలలపాటు చేసుకుంటూ పోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. నివాసాలు, దుకాణాల ముందు తవ్వి వదిలేస్తే రాకపోకలకు ప్రత్యామ్నాయంగా సరివి బాదులు, ఇనుప బల్లలు వంటివి ఏర్పాట్లు చేసుకుంటున్నామన్నారు. మహిళలు, వృద్ధులు, పిల్లలు వాటిపై నుంచి రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదవశాత్తు తవ్విన మురుగు కాలువలో పడిపోయి గాయాలపాలైతే ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో మంజూరైన నిధులతోనే..

విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ నుంచి గుప్తా సెంటర్ వరకు అవుట్‌ఫాల్ నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలోనే రూ.34 లక్షలు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచి కాంట్రాక్టర్ ముందుకు వచ్చే సమయానికి ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు ప్రారంభించలేదు. ఎట్టకేలకు దాదాపు మూడు నెలల క్రితం డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో జరుగుతున్న పనులు చూసి నత్తే నయమని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేక పోవడమే పనుల తాత్సారానికి కారణమని మండిపడుతున్నారు. వాస్తవానికి ఈ డ్రెయిన్ నిర్మాణ పనులు కుమ్మరిపాలెం సెంటర్ నుంచి మొదలు పెట్టాల్సి ఉండగా కాలువపై ఆక్రమణలు ఉన్నాయన్న సాకుతో కొంచెం దూరంలో ఉన్న గంగానమ్మ గుడి వద్ద నుంచి ప్రారంభించారు. మధ్యలో ఎస్‌బీఐ భవనం దగ్గర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అడ్డంకిగా ఉండటంతో అక్కడికి ఆపేసి తరువాత నుంచి కొనసాగించారు. ఇలా అయితే డ్రెయిన్‌లో మురుగునీరు సజావుగా ఎలా ముందుకు ప్రవహిస్తుందని ప్రశ్నిస్తున్నారు. ఉన్న అర కిలోమీటర్ దూరంలో సగం మేరకు నిర్మించటానికే ఇన్ని నెలలు పడితే ఇక కుమ్మరిపాలెం సెంటర్ నుంచి ఎప్పుడు మొదలు పెడతారు. ఎప్పటికి పూర్తవుతుంది... తమ ఇబ్బందులు ఎప్పటికి తీరుతాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా వీఎంసీ అధికారులు చొరవ తీసుకుని పనులు వేగంగా పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

జీఓ నంబర్ 137 రద్దు చేయాలి



పాత బస్టాండ్‌లో ధర్నా చేస్తున్న ఆర్టీసీ స్థలాల పరిరక్షణ కమిటీ

బస్టాండ్(విజయవాడపశ్చిమ): నగరం నడిబొడ్డులో ఆర్టీసీకి పాత బస్టాండ్, గవర్నర్ పేట డిపోలకు చెందిన అతి విలువైన ఆర్టీసీ ఆస్తులను ప్రభుత్వం లీజు పేరుతో కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తూ విడుదల చేసిన జీవో నంబర్ 137ను నిరసిస్తూ విజయవాడ పౌరవేదిక ఆధ్వర్యంలో బుధవారం పాత బస్టాండ్ వద్ద నిరసన ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి వడ్డే శోభానాద్రీశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ నగరంలో ఎంతో చారిత్మాత్మక నేపథ్యం ఉన్న అతి విలువైన ఆర్టీసీకి చెందిన పాత బస్టాండ్ స్థలాన్ని అభివృద్ధి పేరుతో లులూ సంస్థకు కట్టబెట్టడం సరైన విధానం కాదన్నారు. వెంటనే జీవో నంబర్ 137ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ తీరు దుర్మార్గం..

ఆర్టీసీ స్థలాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును సైతం ఉల్లంఘిస్తోందన్నారు. యథేచ్ఛగా సుమారు నాలుగు వందల కోట్ల రూపాయల విలువైన ఆర్టీసీకి చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లీజు పేరుతో బడా వ్యాపారులకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ లులూ వంటి బడా షాపింగ్ మాల్స్ విజయవాడ నగరంలో అడుగు పెడితే ఇప్పటికే ఉన్న చిన్న, మధ్య తరహా వ్యాపారాలు చేసుకునే వారు తమ జీవనోపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఎం నాయకులు దోనేపూడి కాశీనాథ్, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీలు 50 శాతం భాగస్వామ్యంతో ఎంఓయూ చేసుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు, కాలనీలు 50 శాతం భాగస్వామ్యంతో వీఎంసీతో ఎంఓయూ చేసుకోవాలని వీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ అర్జునరావు పేర్కొన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ సమావేశంలో అర్జునరావు నగరంలోని వివిధ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, హోటల్స్, స్కూల్స్, హాస్పిటల్స్, రైతుబజార్లు, కూరగాయల మార్కెట్లు, చికెన్-మటన్ స్టాల్స్ యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలకు అవసరమైన పారిశుద్ధ్య సిబ్బంది జీతం 50 శాతం నగరపాలక సంస్థ, మిగిలిన 50 శాతం కాలనీలు చెల్లించే విధంగా ఎంఓయూ చేసుకోవాలని సూచించారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధించాలి..

నగరంలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ 2016 ప్రకారం 2022లో ఇచ్చిన అమెండ్‌మెంట్స్ మేరకు ప్రతి వ్యాపార సంస్థ, ప్రజలు అమలు చేయాలని అర్జునరావు అన్నారు. దానిలో భాగంగా 120 మైక్రాన్లకన్నా తక్కువ పరిమాణం గల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకం/అమ్మకం నిషేధించాలని తెలిపారు. గత 10 రోజుల్లో నిర్వహించిన తనిఖీల్లో 1371.68 కేజీల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను సీజ్ చేసి రూ.7,41,600లు జరిమానా విధించామన్నారు. ఈ నెల 15 నాటికి నగరంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబూ శ్రీనివాస్, డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర రెడ్డి, బయాలజిస్ట్ వి.కామేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కంప్యూటర్ అనుబంధ రంగాలపై పట్టు సాధించాలి



ఆర్కే మహన్‌ను సత్కరిస్తున్న కళాశాల కమిటీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు కంప్యూటర్స్ దాని అనుబంధ రంగాలపై పట్టు సాధించాలని రోబోటిక్ ప్రొడక్ట్ రీసెర్చ్ ఇంజినీర్ ఆర్కే మహన్ అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో 'రోబోటిక్స్ - ఆటోమేషన్ - తాజా పరిణామాలు' అంశంపై సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్కే మహన్ మాట్లాడుతూ.. విద్యార్థులు రోబోటిక్స్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగాలు, ఆ రంగంలో చోటు చేసుకున్న నూతన ఆవిష్కరణలు, రానున్న కాలంలో వచ్చే మార్పులు, భవిష్యత్ అవకాశాలు తదితర అంశాలపై ప్రసంగించారు. విద్యార్థులు వారు ఎంచుకున్న రంగాలపై మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తమ రంగాలకు సంబంధించి నిర్వహిస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ అధ్యక్షత వహించారు. విభాగాధిపతి ఆక్టర్ షణ్ముఖ్‌రావు, కోఆర్డినేటర్ మమతా చౌదరి నిర్వహించారు.

సమాజాభివృద్ధే లక్ష్యం



ఉపకార వేతనాలు అందజేస్తున్న నిర్వాహకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సమాజాభివృద్ధే ధ్యేయంగా తమ అసోసియేషన్ పని చేస్తోందని ది కృష్ణా డిస్ట్రిక్ట్ ఆటో ఫైనాన్సియర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.జయప్రకాష్ నారాయణ చౌదరి అన్నారు. ది కృష్ణా డిస్ట్రిక్ట్ ఆటో ఫైనాన్సియర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం సున్నపుబట్టీల సెంటర్‌లోని అసోసియేషన్ హాలులో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ చౌదరి మాట్లాడుతూ తమ అసోసియేషన్ ప్రారంభం నాటి నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఆటో యజమానులు, డ్రైవర్లకు ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించడంతో పాటు వారి పిల్లల విద్యను అభ్యసించేందుకు ఉపకార వేతనాలు కూడా అందజేస్తున్నామన్నారు. ఈ ఏడాది 87 మంది విద్యార్థులకు 4 లక్షల 35 వేల రూపాయలను ఉపకార వేతనాలుగా అందించామని చెప్పారు. వరదల సమయంలో వరద బాధితులకు సహాయ కార్యక్రమాలు, వరద బాధితుల సహాయ నిధికి రాష్ట్ర ప్రభుత్వానికి రూ.5 లక్షల చెక్కును ఇచ్చామన్నారు. అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యుడు పీఎస్‌వీ.ప్రసాదరావు, అసోసియేషన్ కార్యదర్శి వల్లూరి నాగార్జున, కోశాధికారి తిరువీధి హరికృష్ణ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చైతన్య కళాశాల వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి పంచాయతీ పరిధిలోని హెచ్‌ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన శ్రీచైతన్య(భవానీ నిలయం) కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా జరిగాయి. శ్రీచైతన్య విద్యా సంస్థల కార్యనిర్వాహక ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. గతేడాది మెడికల్, ఇంజనీరింగ్ సీట్లు పొందిన విద్యార్థులకు జ్ఞాపికలను బహూకరించారు. శ్రీచైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్ హరిబాబు వారిని అభినందించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ మాట్లాడుతూ తమ విద్యార్థులు మరిన్ని విద్యా విజయాలు సాధించి మరెన్నో మైలురాళ్లను నెలకొల్పుతారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భవానీ నిలయం ప్రిన్సిపాల్ ఎంవీఆర్, వివిధ విభాగాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దసరా ఉత్సవాలపై సమీక్ష సమావేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాల ఏర్పాట్లపై దేవదాయ శాఖ అధికారులు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. గురువారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని మహా మండపం నాల్గో అంతస్తులో నిర్వహించే సమీక్ష సమావేశానికి దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, దసరా ఉత్సవాలకు ఫెస్టివల్ ఆఫీసర్‌గా నియమితులైన పూర్వ ఈవో భ్రమరాంబతో పాటు దుర్గగుడి దేవస్థానానికి చెందిన ఇంజినీరింగ్, ఇతర విభాగాల అధికారులతో పాటు దేవదాయ శాఖ, ఇతర ముఖ్య అధికారులు హాజరుకానున్నారు. ఈ ఏడాది సింహాచలం దేవస్థానంలో చందనోత్సవ సమయంలో గోడ కూలిన ఘటన, గత నెల సింహాచలం గిరి ప్రదక్షిణ నేపథ్యంలో షెడ్డు కూలిన క్రమంలో దసరా ఉత్సవాలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఏర్పాట్లు చేసేలా చర్చించనున్నారు. మరో వైపున ఈ ఏడాది దసరా ఉత్సవాల ఏర్పాట్లలో ప్రభుత్వం కొన్ని కీలక మార్పులు చేయాలని దేవదాయ శాఖకు సూచించినట్లు సమాచారం. దసరా ఉత్సవాల పనులపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయడంతో పాటు పనుల పురోగతి, నాణ్యత వంటి అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని దేవదాయ శాఖ మంత్రి ఇప్పటికే ఆలయ అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం జరిగే సమీక్ష సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకుంది.

మంచినీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ లక్ష్మీశ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లా వ్యాప్తంగా తాగునీటి సరఫరాలో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ బుధవారం తన క్యాంపు కార్యాలయంలో గ్రామీణ నీటిసరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్)పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలో నీటి వనరులు, తాగునీటి సరఫరా వ్యవస్థలపై చర్చించి, గుర్తించిన సమస్యల పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా మంచినీటిని సరఫరా చేయడంలో ఇబ్బందులు లేకుండా చూడాలని, ఇందుకు క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలోని మొత్తం 20 సీపీడబ్ల్యూ పథకాల ద్వారా మంచినీటి సరఫరాలో సమస్యలు ఎదురు కాకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్‌ఎం) పెండింగ్ పనులను ఎప్పటికప్పుడు పూర్తిచేయడం, బిల్లుల చెల్లింపులు, అవసరమైన మరమ్మతులు, పైపులైన్ల లీకేజీలు వంటివి లేకుండా చూడటం, పంపు హౌస్, మోటార్లు సక్రమంగా పనిచేసేలా చూడటం తదితర పనులపై క్షేత్రస్థాయిలో నిరంతర సమీక్షలు అవసరమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, గ్రామీణ నీటిసరఫరా ఎస్ఈ ఎస్.విద్యాసాగర్, డీఈ వి.రవికుమార్, ఏఈ దయానంద్, కాంట్రాక్టర్ వి.రామారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై టీడీపీ గూండాల దాడి హేయం

వైఎస్సార్ సీపీ ఆర్టిజన్ సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్



భవానీపురం(విజయవాడపశ్చిమ): పులివెందులలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గూండాల దాడి హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ ఆర్టిజన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు తోలేటి శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ కిరాయి గూండాలు ఎన్నికల నిబంధనలను అతిక్రమించి అధికార మదంతో బరితెగించి ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో రమేష్ తదితరులపై ఇనుప రాడ్లు, కర్రలు, రాళ్లతో వైఎస్సార్ సీపీ నాయకుల కార్లను ధ్వంసం చేయడం అమానుషం, అప్రజాస్వామికమని పేర్కొన్నారు. బీసీ నాయకులపై వారు చేసిన దాడి టీడీపీకి భస్మాసుర హస్తం అని నిరూపిస్తామన్నారు. బీసీలపై దాడి చేస్తే జరిగే పరిణామలు ఎలా ఉంటాయో రాబోయే రోజుల్లో టీడీపీకి తెలియచేసేలా వైఎస్సార్ సీపీ చర్యలు ఉంటాయని తెలిపారు. ఒక వైపు తమది బీసీల పార్టీ అని చెప్పుకునే టీడీపీ ఇతర పార్టీల్లోని బీసీలపైనే దాడి చేయటం ఆ పార్టీ ద్వంద నీతికి నిదర్శనమని మండిపడ్డారు. టీడీపీ కక్ష సాధింపు చర్యలకు తగిన సమయంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఆరోగ్య నియమాలపై బాలికలకు అవగాహన



శానిటరీ ప్యాడ్స్ కిట్‌లను అందజేస్తున్న వైద్యులు అఫీఫా, షమా సుల్తానా తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాల బాలికలకు నెలసరిపై అనేక అపోహలు, అనుమానాలు ఉన్నాయని, వాటిని వీడి ఎటువంటి ఇబ్బందులున్నా తల్లికి చెప్పాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా సూచించారు. ఎక్స్‌పాండింగ్ హ్యూమానిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేఎల్‌రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో బాలికలకు నెలసరిపై డాక్టర్ అఫీఫా అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ షమాసుల్తానా బాలికలతో మాట్లాడారు. వయస్సు రీత్యా జరిగే మార్పులు, నెలసరిపై అనేక మందిలో భయాలు ఉన్నాయని అటువంటి అపోహలు, సిగ్గుపడటం, భయపడటం, అదేదో తప్పుగా భావించడం సరికాదన్నారు. శరీర నిర్మాణంలో వివిధ దశలను బొమ్మల రూపంలో వివరించారు. ఏ ఆహారం తీసుకోవాలి, ఎటువంటి ఆహారానికి దూరంగా ఉండాలనే పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అఫీఫా తమ ట్రస్ట్ ద్వారా సుమారు 500 మంది బాలికలకు శానిటరీ ప్యాడ్స్ కిట్స్, సబ్బులను అందజేశారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా ప్రముఖ విద్యావేత్త ఎస్.రేణుకాదేవి బాలికలు తమ ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్వీ.రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్లవర్ మార్కెట్.. ఫుల్ రష్







శ్రావణ శుక్రవారంతో పాటు వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని పూల మార్కెట్‌లో బుధవారమే ఫుల్ రష్ నెలకొంది. మున్సిపల్ కార్యాలయం రోడ్డుతో పాటు ఫ్లవర్ మార్కెట్ పరిసరాలు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

13న స్వాతంత్య్ర ఉద్యమ శంఖారావం



కృష్ణలంక(విజయవాడతూర్పు): 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు స్వాతంత్య్ర ఉద్యమ శంఖారావం నిర్వహిస్తున్నట్లు అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు అన్నారు. నగరంలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ జి.లక్ష్మీశ చేతుల మీదుగా శంఖారావం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ.. జాషువా సాంస్కృతిక వేదిక, అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 450 మంది విద్యార్థిని విద్యార్థులతో కళారూపాలు ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్ అధ్యక్షులు సునీల్ కుమార్, అరసవల్లి గిరిధర్, జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు, పి.ఐజాక్ నూటన్, చంద్రిక, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.